మంగళవారం 10-09-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 451 పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



ముందు మీ గొంతు తగ్గించి మాట్లాడండి

మిగతా 2లో



అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

మిగతా 2లో



త్వరలో మేడ్ ఇన్ ఇండియా బుల్లెట్ రైలు..

మిగతా 4లో



విఫల ప్రేమకథ.. బ్రేకప్ నిజంగా చాలా బాధాకరం: తమన్నా

మిగతా 5లో




## కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ మరవదు

### కేసీఆర్‌కు నిలువ నీడ ఇచ్చింది బాపూజీనే

### చేనేత రంగంలో ఆవిష్కర్తలకు ప్రత్యేక కోర్సులు

### చేనేత లోగో ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

**ముందడుగు తెలంగాణ:**

కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ స్థలం ఇచ్చి, నిలువ నీడ ఇచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. నాంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని (ఐఐహెచ్‌టీ) వర్చువల్‌గా ప్రారంభించారు. లలిత కళాతోరణంలో ఇందుకు సంబంధించిన ప్రారంభోత్సవం నిర్వహించారు. చేనేత అభయహస్తం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదులుకున్నారని చెప్పారు.

మిగతా 2లో

## త్వరలో భారత పర్యటనకు జెలెన్ స్కీ..

### ప్రపంచ శాంతి స్థాపనపై చర్చ



**ముందడుగు జాతీయం:**

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ త్వరలోనే భారతదేశ పర్యటనకు రానున్నట్లు సమాచారం. ఇంకా పర్యటన తేదీలు ఖరారు కానప్పటికీ.. ఈ ఏడాది చివరి నాటికి భారత్‌లో పర్యటించే ఛాన్స్ ఉందని ఉక్రెయిన్ రాయబారి తెలిపారు. ఇటీవల ఉక్రెయిన్‌లో పర్యటించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. భారత్‌కు రావాలని జెలెన్‌స్కీని ఆహ్వానించారు. నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఏడాది చివర్లో ఇక్కడ పర్యటించే చాన్స్ కనిపిస్తుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఇదో ముందడుగు కానుంది.

మిగతా 2లో

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు కీలక తీర్పు

### నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశం

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది. అప్పటిలోగా నిర్ణయం తీసుకోకపోతే సుమోటో కేసుగా విచారిస్తామని పేర్కొంది. పార్టీ

మిగతా 2లో



## మంకీపాక్స్ అనుమానితులను గుర్తించండి

### రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం

**ముందడుగు జాతీయం:**

దేశంలో మంకీపాక్స్ అనుమానితులను గుర్తించడంతో కేంద్రం అప్రమత్తమై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ప్రపంచ

మిగతా 2లో



ముందడుగు
మంగళవారం, 10-09-2024, హైదరాబాద్

# కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ మరవదు

(మొదటిపేజీ తరువాయి)

కానీ కొంత మంది రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలు, ఉపఎన్నికలు తెచ్చారన్నారు. ఆ ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగమని చెప్పుకొంటున్నారని విమర్శించారు. గజ్వేల్‌లో ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కేసీఆర్, కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలకు తేడా గమనించాలన్నారు. ఉప ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లతో బాగుపడిందెవరో ప్రజలకు తెలుసన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తిస్తుందని చెప్పారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకుందామన్నారు.

ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని ప్రధాని, కేంద్రమంత్రులను కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వారు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి తక్షణమే మంజూరు చేశారని చెప్పారు. నాంపల్లి తెలుగు అకాడమీలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

''గత ప్రభుత్వ హయాంలో చేనేతల జీవన విధానంలో మార్పులు రాలేదు. సిరిసిల్ల నేతన్నలకు బకాయిలు చెల్లించలేదు. కాంగ్రెస్ వచ్చాక వెంటనే వాటిని విడుదల చేశాం. 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. చేనేతల రుణభారం రూ.30 కోట్లు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కుల, చేతి వృత్తులకు సముచిత న్యాయం చేస్తాం'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కర్తల కోసం ఐఐహెచ్‌టీ ప్రారంభించారు. చేనేత రంగంలో ఆవిష్కర్తల ప్రోత్సాహానికి ప్రత్యేక కోర్సులు, శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ అందించనున్నారు. అధునాతన పరిశోధన అవకాశాలను ఈ సంస్థ కల్పించనుంది. ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులు ఇవ్వనున్నారు.

# ముందు మీ గొంతు తగ్గించి మాట్లాడండి

## న్యాయవాదికి సుప్రీంకోర్టు సీజేఐ హెచ్చరిక

ముందడుగు జాతీయం:





పశ్చిమబెంగాల్ కోల్‌కతా ఘటనపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా బెంగాల్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ.. ఆగస్టు 9న ప్రభుత్వ ఆధీనంలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో జరిగిన సంఘటనపై నిరసనలు చేస్తున్న వారిపై న్యాయవాది కౌస్తవ్ బాగ్చి రాళ్లు రువ్వుతున్నట్లు నిరూపించేందుకు తన వద్ద వీడియోలు, ఫోటోలు ఉన్నాయని పేర్కొన్నారు. కౌస్తవ్ బాగ్చి బీజేపీ నేత.. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. కపిల్ సిబల్ ఆరోపణలపై.. న్యాయవాది కౌస్తవ్ స్పందిస్తూ..ఒక సీనియర్ న్యాయవాది కోర్టులో అలాంటి ప్రకటనలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో సీజేఐ కల్పించుకొని.. మీ ముందు ముగ్గురు న్యాయమూర్తులు ఉన్నారు. ముందు గొంతు తగ్గించుకొని మాట్లాడండి' అంటూ హెచ్చరించారు. 'గత రెండు గంటలుగా మీ ప్రవర్తనను గమనిస్తున్నాను. మీ మీ పిచ్‌ని ముందు తగ్గించండి. మీరు న్యాయమూర్తులను ఉద్దేశించి మాట్లాడుతున్నారు. కోర్టు వెలుపల ఉన్న గ్యాలరీని ఉద్దేశించి కాదు.' అంటూ మండిపడ్డారు. దీంతో న్యాయవాది కౌస్తవ్ త్రిసభ్య ధర్మాసనానికి క్షమాపణలు తెలియజేశారు. చీఫ్ జస్టిస్ బాగ్చిని మందలించడంపై తృణమూల్ కాంగ్రెస్ స్పందించింది. 'పార్ట్‌టైమ్ న్యాయవాది, ఫుల్‌టైం బీజేపీ కార్యకర్త అయిన కౌస్తవ్ బాగ్చి నుంచి ఇంకా ఏం ఆశించగలమని మండిపడింది. తమ(బీజేపీ) పాలనలో ఉన్న రాష్ట్రాల్లో మాదిరి కోర్టు గదిని బుల్డోజ్ చేయవచ్చని భావించే వీరి నుంచి ఇలాంటి ప్రవర్తనే ఉంటుందని విమర్శలు గుప్పించింది. నేడు సీజేఐ అతన్ని సరిగ్గా మందలించింది అంటూ తెలిపింది

# త్వరలో భారత పర్యటనకు జెలెన్ స్కీ..

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనపై చర్చించేందుకు ఈ ఇద్దరు నేతలకు ఇది గొప్ప అవకాశాన్ని కల్పిస్తుందని భారత్‌లోని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్‌చుక్ వెల్లడించారు.
మరోవైపు, రెండున్నరేళ్లుగా యుద్ధంతో ఇబ్బంది పడుతున్న ఉక్రెయిన్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 23వ తేదీన పర్యటించారు. 1991లో సోవియట్ నుంచి విడిపోయి ఉక్రెయిన్‌గా ఏర్పడిన తర్వాత ఓ భారత ప్రధాని ఆ దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో చర్చలు, దౌత్య మార్గాల్లో ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి ముగింపు పలికేందుకు.. ఇందుకు అన్ని విధాలా కృషి చేస్తామని భారత్ భరోసా కల్పిస్తోంది.

# మంకీపాక్స్ అనుమానితులను గుర్తించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్య సంస్థ ఈ వ్యాధిని పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా జారీ చేసిన హెల్త్ అడ్వైజరీ ప్రకారం భారత్‌లో ఇప్పటి వరకు ఒక్క మంకీపాక్స్ కేసు కూడా నిర్ధరణ కాలేదు. దీని విషయంలో రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ క్రమంలో ఆరోగ్యమంత్రిత్వ శాఖ సూచించిన వ్యూహాలను అమలు చేయాలని పేర్కొంది. దేశంలో మంకీపాక్స్ క్లస్టర్లను గుర్తించడానికి నేషనల్ ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎయిర్ పోర్టుల్లో మంకీపాక్స్ స్క్రీనింగ్ మరింత వేగవంతం చేసినట్లు వెల్లడించింది. అనుమానిత కేసులను పరీక్షించేందుకు వీలుగా ఐసీఎంఆర్ ఆధీనంలోని పరిశోధనాశాలల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నట్లు హెల్త్ మినిస్ట్రీ పేర్కొంది. రాష్ట్రాలు చర్మ, ఎస్‌టీడీ వ్యాధులకు చికిత్స చేసే క్లినిక్స్‌పై దృష్టిపెట్టాలని సూచించింది. వ్యాధి లక్షణాలు కనిపించిన పేషెంట్ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఈ వ్యాధి, దాని వ్యాప్తిపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తెలిపింది. ప్రజల్లో అనవసర భయాలు పోగొట్టేందుకు కృషి చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ తన అడ్వైజరీలో పేర్కొంది.

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

## కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు



ముందడుగు జాతీయం:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ కొన్ని జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఏపీలోని కళింగపట్నం ఒడిశాలోని గోపాలపూర్ ప్రాంతాల మధ్య కేంద్రీకృతమై ఉందని రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండం గా బలపడి ఒడిస్సా పశ్చిమ బెంగాల్ తీరాల్లో కేంద్రీకృతమై ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు కీలక తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. భారాస, భాజపా నేతలు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై వేటు వేయాలని భారాస నేతలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్ పిటిషన్ వేశారు. దానంపై అనర్హత వేటు వేయాలని బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వీటన్నింటిని కలిపి హైకోర్టు విచారించగా.. సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను స్పీకర్ పట్టించుకోవడం లేదంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది.

ముందడుగు
మంగళవారం, 10-09-2024, హైదరాబాద్

## షవోమీ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్న కత్రినా కైఫ్




**ముందడుగు హైదరాబాద్:**

తన ఆవిష్కరణలతో గుర్తింపు దక్కించుకున్న గ్లోబల్ టెక్నాలజీ బ్రాండ్ షవోమీ ఇండియా, నేడు దిగ్గజ నటి కత్రినా కైఫ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. షవోమీకి చెందిన విభిన్న శ్రేణి స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు మరియు టాబ్లెట్‌లకు కైఫ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తారు. ఉత్తేజకరమైన ప్రకటన నేపథ్యంలో, షవోమీ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనూజ్ శర్మ మాట్లాడుతూ, "మేము భారతదేశంలో ఒక దశాబ్దం పాటు చేసిన ఆవిష్కరణలను స్మరించుకుంటున్నప్పుడు, కత్రినా కైఫ్‌ను తిరిగి షవోమీ కుటుంబానికి స్వాగతించడం సరైన మార్గంగా అనిపిస్తుంది. దయ, విస్తృత ఆకర్షణ మరియు మా ప్రేక్షకులతో లోతైన అనుబంధం మా తదుపరి అధ్యాయానికి ఆమెను ఆదర్శ రాయబారిగా చేస్తుంది. షవోమీ మరియు కత్రినా రెండూ మిలియన్ల మంది వ్యక్తులతో మనోహరమైన రీతిలో కనెక్ట్ అయ్యే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఆమెతో కలిసి మేము ఈ భాగస్వామ్యంతో మాయాజాలాన్ని సృష్టించడం కొనసాగిస్తాము మరియు ప్రతి ఒక్కరికీ వినూత్న సాంకేతికతను అందిస్తాము'' అని వివరించారు.


## ఆకట్టుకునే కథాంశంతో
# మైక్రో ఫిల్మ్ దిక్సూచి
### పోస్టర్ విడుదల చేసిన చంచల్‌గూడ ఎస్పీ శివకుమార్




**హైదరాబాద్:**

సమాజంలో అమ్మాయిలపై జరుగుతున్న అఘాయిత్యాలే ప్రధాన అంశంగా వినూత్న కథాంశంతో తెరకెక్కుతున్న మైక్రో ఫిల్మ్ పోస్టర్‌ను చంచల్‌గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ గౌడ్, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, మీడియా కార్యదర్శి జయరాం సోమవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒంటరి మహిళల పైన అఘాయిత్యాలు చేసే వాళ్ళ మైండ్ సెట్ మారాలని, ఆడవారిని గౌరవించడం పాఠశాల దశనుండే అలవర్చాలని అన్నారు. ఒక మహిళా వైద్యురాలికి జరిగిన అఘాయిత్యంపై లఘు చిత్రం నిర్మించడం ద్వారా సమాజానికి మంచి మెసేజ్ ఇస్తున్నారని తెలిపారు. చిత్ర దర్శకులు, నిర్మాత శివ నాగరాజ్, కొమటి రమేష్‌బాబు మాట్లాడుతూ మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రం చేస్తున్నందుకు సంతోషంగా ఉందని, ఈ నెలాఖరుకల్లా ఈ లఘు చిత్రం ప్రేక్షకులకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ చిత్రంలో నటిగా హేమ, యూట్యూబ్ నటులు ఆర్యన్ వర్మ, దినేష్, క్రేజీ బాయ్స్ సాయి నటించగా కేతన్, నవీన్ కుమార్, మణికంఠ, హర్ష భరద్వాజ్ జాఫర్, వంశీ కృష్ణ సాంకేతిక సహకారం అందించారు.

## హైదరాబాద్‌లో తన ఉనికిని విస్తరించిన ఐడీబీఐ బ్యాంక్



**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో 111వ బ్రాంచ్‌ను ప్రారంభించడంతో ఐడీబీఐ బ్యాంక్ హైదరాబాద్ జోన్‌లో తన పరిధిని విస్తరించింది. వ్యూహాత్మకంగా మెట్రో స్టేషన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన ఈ శాఖను బ్యాంకు అధికారులతో కలిసి ఐఆర్ఎస్ అధికారి, ఆదాయపన్ను శాఖ కమిషనర్ జీవన్ లాల్ లావిడియా ప్రారంభించారు. చీఫ్ జనరల్ మేనేజర్ మరియు జోనల్ హెడ్ శరత్ కామత్, డిప్యూటీ జోనల్ హెడ్ వి వాసుదేవన్, జనరల్ మేనేజర్ మరియు సీనియరు ఆర్‌హెచ్ సందీప్ పట్నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్యాంక్ అందించే వివిధ ఉత్పత్తులు, సేవలను బ్రాంచ్ హెడ్ దీప్తి అన్నెపు పరిచయం చేశారు. స్థానికులు, వాణిజ్య సంస్థలకు అనుకూలమైన బ్యాంకింగ్ పరిష్కారాలతో మద్దతు ఇచ్చేందుకు బ్రాంచ్ నిబద్ధతను ఆమె వివరించారు. ఇది హైదరాబాద్ జోన్‌లో 111వ శాఖ కాగా, తెలంగాణలో 51వ శాఖ.


## శ్రీశైలంలో విభూతిధారణ
# పునఃప్రారంభం
### ప్రారంభించిన ఆలయ ఈవో డి.పెద్దిరాజు



**ముందడుగు శ్రీశైలం:**

శ్రీశైలం ఆలయంలోకి ప్రవేశించే భక్తులకు విభూతిధారణ చేయించే సంప్రదాయాన్ని దేవస్థానం దర్శనం క్యూ కాంప్లెక్సు దగ్గర ఈ విభూతిధారణను దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు సోమవారం ఉదయం పున:ప్రారంభించారు. ఆలయ సంస్కృతీ సంప్రదాయాలపై భక్తులందరికీ మరింత అవగాహన కల్పించాలనే సంకల్పముతో ఈ విభూతిధారణ కార్యక్రమాన్ని తిరిగి ప్రవేశపెట్టడం జరిగింది. భక్తులకు విభూతిధారణ చేయించేందుకు శివసేవకుల సహకారాన్ని తీసుకోవడం జరుగుతోంది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ నుదుట బొట్టు పెట్టుకోవడం అనేది మన సనాతన సంప్రదాయమన్నారు. ఎంతో విశిష్టమైన మన ఆర్ష సంస్కృతికి ఇది ప్రతీకగా నిలుస్తుందన్నారు. విభూతిధారణ పున:ప్రారంభకార్యక్రమములో స్వామివార్ల ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, సహాయ కార్యనిర్వహణాధికారులు ఎం.హరిదాసు,ఐ.ఎన్.వి. మోహన్, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, పర్యవేక్షకులు టి. హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ముందడుగు
మంగళవారం,
10-09-2024,
హైదరాబాద్



## త్వరలో మేడ్ ఇన్ ఇండియా
# బుల్లెట్ రైలు..
### గంటకు 250 కిలోమీటర్ల వేగం
### తయారీకి బిడ్లను ఆహ్వానించిన కేంద్ర రైల్వేశాఖ

**ముందడుగు జాతీయం:**

రైలు ప్రయాణమంటే ఆసక్తి చూపే ప్రయాణీకులు చాలా మంది ఉంటారు. ప్రజల ఆలోచనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రైళ్లను అభివృద్ధి చేస్తోంది. వాటిలో మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పిస్తోంది. దీనిలో భాగంగా గంటలకు 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రైలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులను మరింత వేగంగా గమ్యస్థానాలకే చేర్చే విధానంలో భాగంగా అత్యధిక వేగంతో ప్రయాణించే రైళ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకురానుంది. ఇందుకోసం గంటకు 250 కిలోమీటర్ల వేగంతో నడిచే రెండు రైలు సెట్ల రూపకల్పన, తయారీకి రైల్వే మంత్రిత్వ శాఖ బిడ్లను ఆహ్వానించింది. ఈ ఏడాది జూన్‌లో భారతీయ రైల్వే చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)కు రెండు స్టాండర్డ్ గేజ్ రైలు సెట్ రేక్‌లను తయారు చేయాలని లేఖ రాసింది. రైలు సెట్ ఉక్కుతో తయారు చేయాలని, గంటకు 250 కిలోమీటర్ల వేగంగా ప్రయాణించేలా ఉండాలని సూచించింది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గరిష్టంగా గంటలకు 160 కిలోమీటర్ల వేగంగా రాకపోకలు సాగిస్తోంది. రైలు ప్రయాణికులకు సౌకర్యాలు పెంచడంతో పాటు స్పీడ్ రైళ్ల రూపకల్పనకు ప్రాధాన్యమిచ్చింది. రైల్వే శాఖ తీసుకుంటున్న కొత్త నిర్ణయాలపై ప్రయాణికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

**అప్ గ్రేడ్ వెర్షన్..**

వందే భారత్ స్లీపర్ వెర్షన్ అప్‌గ్రేడ్ అవుతుంది. ముందు నుంచి వెనక వరకూ ఆధునీకరిస్తున్నారు. ముక్కు కోన్ నుంచి ఇంటీరియర్ ప్యానెళ్లు, సీట్లు, స్లీపర్ బెర్తులు తదితర వాటిని అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రొపల్షన్, బోగీలు, ఎక్స్‌టీరియర్ ప్లగ్ డోర్లు, బ్రేక్ సిస్టమ్‌లు, హెచ్ వీఏసీ వంటి కీలక సిస్టమ్‌ల సముదాయానికి బీఈఎంఎల్ ఎలక్ట్రికల్ శ్రద్ధ తీసుకోనుంది.

**ఆధునిక వసతులు**

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈనెల మొదట్లో బెంగళూరు రైలు కాంప్లెక్స్‌లో దేశంలోనే మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు సెట్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలులో అనేక అత్యాధునకి వసతులు కల్పించారు. యూఎస్ బీ ఛార్జింగ్ సదుపాయం, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, విజువల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లతో కూడిన ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్, డిస్‌ప్లే ప్యానెళ్లు, సెక్యూరిటీ కెమెరాలు, మాడ్యులర్ ప్యాంట్రీలు, వికలాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక బెర్తులు, లేటెస్ట్ టాయిలెట్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు. వీటితో పాటు 1వ ఏసీ కారులో ప్రయాణికులకు స్నానం కోసం వేడినీటిని అందించే ఏర్పాటు కూడా ఉంది. ఈ రైలు సెట్ ముందు ముక్కు కోన్ నుంచి ఇంటీరియర్ ప్యానెళ్లు, సీట్లు, స్లీపర్ బెర్తులు, మరెన్నో అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు.

# దేశంలో అత్యంత వేగంగా నడిచే ఐదు రైళ్లు
## ఈ రైలు మూడు స్టాప్‌లలో మాత్రమే ఆగుతాయి
### విలాసవంతమైన సౌకర్యాలు ఉంటాయి



**ముందడుగు ప్రత్యేకం:**

భారతదేశపు అత్యంత వేగవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసే భారతదేశంలోని రైళ్ల గురించి ఇక్కడ తెలుసుకుందాం.. భారతీయ రైల్వేలు ప్రపంచంలో నాలుగవ పొడవైన రైల్వే నెట్‌వర్క్‌గా పేరుగాంచాయి. ఆసియాలో రెండవ పొడవైన రైల్వే నెట్‌వర్క్. ప్రతిరోజు లక్షలాది మంది రైల్వే ప్రయాణికులు భారతీయ రైల్వే ద్వారా ప్రయాణిస్తున్నారు. సాధారణ ప్యాసింజర్ రైళ్ల నుండి విలాసవంతమైన హైస్పీడ్ రైళ్ల వరకు, భారతీయ రైల్వేలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, మెయిల్, డిఎంయూ రైళ్లతో సహా అనేక రకాల సేవలను తన ప్రయాణికుల భిన్నమైన అవసరాలను తీరుస్తుంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఇందులో అత్యంత వేగవంతమైన రైలుగా పరిగణించబడుతుంది.

**వందే భారత్ ఎక్స్‌ప్రెస్**

దేశవ్యాప్తంగా నడుస్తున్న లెక్కలేనన్ని రైళ్లలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఒకటి. భారతదేశంలో అత్యంత వేగవంతమైన రైళ్లలో ఇది కూడా ఒకటి. ఇది గంటకు 180 కి.మీ కంటే ఎక్కువ వేగంతో పరిగెత్తగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. భారతీయ రైల్వేలలో వేగం విషయంలో వందే భారత్‌నే ప్రమాణాలను నెలకొల్పింది. అయితే, ప్రస్తుతం ఇది గంటకు 120 నుండి 130 కిమీల వేగంతో నడుస్తోంది. దేశంలోని అనేక ప్రాంతాలకు 50 కంటే ఎక్కువ రైళ్లు సేవలందించడంతో ప్రస్తుతం ఇది ఎక్కువ ప్రజాదరణ పొందిన రైలుగా మారింది.

**గతిమాన్ ఎక్స్‌ప్రెస్**

భారతదేశంలో రెండవ అత్యంత వేగవంతమైన రైలు గతిమాన్ ఎక్స్‌ప్రెస్. ఇది 2016లో ప్రవేశపెట్టబడింది. ఈ రైలు గంటకు 160 కి.మీ వేగంతో ప్రయాణించడం ప్రత్యేకం. వేగంతో పాటు ఇందులో కల్పించిన సౌకర్యాలు కూడా ప్రయాణీకుల ప్రయాణాన్ని సౌకర్యవంతంగా చేస్తాయి. గతిమాన్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు ప్రీమియం ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది. రైలు నంబర్లు 12049/12050 కింద నిర్వహించబడుతుంది. ఇది న్యూఢిల్లీని ఝాన్సీతో కలుపుతుంది.

**భోపాల్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్**

భోపాల్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ భారతదేశంలో మూడవ అత్యంత వేగవంతమైన రైలు. న్యూఢిల్లీ, భోపాల్‌లోని రాణి కమలపాటి స్టేషన్ మధ్య నడుస్తున్న ఈ రైలు గంటకు 150 కి.మీ వేగంతో నడుస్తుంది. రైళ్లలో, ఇది చాలా కాలంగా భారతీయ ప్రయాణీకుల ఇష్టమైన రైలుగా మిగిలిపోయింది. ఇది ఇంటర్‌సిటీ మార్గాల్లో సమయపాలన, సౌకర్యానికి ప్రసిద్ధి చెందింది.

**రాజధాని ఎక్స్‌ప్రెస్**

ఇష్టమైన, వేగవంతమైన రైళ్లలో రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఉంది. ముఖ్యంగా ముంబైన్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ గంటకు 140 కి.మీ వేగంతో నడుస్తుంది. ఈ రైళ్లు వాటి ఆన్‌బోర్డ్ సౌకర్యాలు, హైక్లాస్ సర్వీస్‌కు ప్రసిద్ధి చెందాయి. వీటిని సుదూర ప్రయాణానికి ఇష్టపడే ఎంపికగా చేస్తాయి.

**దూరంతో ఎక్స్‌ప్రెస్**

దురంతో ఎక్స్‌ప్రెస్ అనేది హై-స్పీడ్ నాన్-స్టాప్ రైలు సర్వీస్, ఇది దేశంలోని అత్యంత వేగవంతమైన రైళ్లలో ఒకటి. ఇది గంటకు 135 కి.మీ వేగంతో నడుస్తుంది. దురంతో అనేక మెట్రోపాలిటన్ నగరాలను కలుపుతూ బయలుదేరిన స్టేషన్ నుంచి ప్రయాణికులను గమ్యానికి చేర్చే క్రమంలో కేవలం మూడు స్టేషన్లలో మాత్రమే ఆగుతుంది. బయలుదేరిన స్టేషన్ నుంచి నాన్-స్టాప్‌గా 493 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీంతో దేశంలో ఆగకుండా ఎక్కువ దూరం ప్రయాణించిన రైలుగా గుర్తింపు పొందింది.

ముందడుగు
మంగళవారం, 10-09-2024, హైదరాబాద్



# విఫల ప్రేమకథ.. బ్రేకప్ నిజంగా చాలా బాధాకరం: తమన్నా

ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన విఫల ప్రేమకథల గురించి గుర్తుచేసుకుంది మిల్కీబ్యూటీ తమన్నా. ఆమె హృదయం ఇప్పటికి రెండు సార్లు ముక్కలైందట. ఈ విషయంపై తమన్నా మాట్లాడుతూ 'బ్రేకప్ నిజంగా చాలా బాధాకరం. అది అనుభవించిన వారికే తెలుస్తుంది. నా జీవితంలో రెండుసార్లు బ్రేకప్‌ని ఎదుర్కొన్నాను. టీనేజ్‌లో ఉన్నప్పుడే తొలి హార్ట్‌బ్రేక్ ఎదురైంది. జీవితంలో ఏదోఒకటి సాధించాలనేది నా అభిమతం. ఓ వ్యక్తికోసం లక్ష్యాన్ని వదులుకోవడం నచ్చలేదు. ఆ కారణంలో ఓ బంధం తెగిపోయింది. అది జరిగిన కొన్నేళ్ల తర్వాత ఓ వ్యక్తిని ఇష్టపడ్డా. అతనితో కొంతకాలం రిలేషన్లో ఉన్నా. అతను మాట్లాడితే అబద్ధాలే. అనవసరంగా అబద్ధాలాడేవాళ్లంటే నాకు అసహ్యం. తను నాకు సెట్ కాదని మనసు చెప్పింది. దాంతో అతడ్ని కట్ చేయక తప్పలేదు.' అని గత జ్ఞాపకాలను నెమరువేసుకుంది.




# ఒకే ఫ్రేమ్‌లో సందీప్ రెడ్డి వంగా, జూనియర్ ఎన్టీఆర్ .. స్పెషలేంటో మరి..!

అర్జున్ రెడ్డి సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు సందీప్ రెడ్డి వంగా. తొలి సినిమాతోనే నెట్టింట హాట్ టాపిక్‌గా మారాడు. ఇక రణ్‌బీర్‌కపూర్‌తో తెరకెక్కించిన యానిమల్ వసూళ్ల వర్షం కురిపించింది. ఈ క్రేజీ డైరెక్టర్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ తో కలిసి ఉన్న ఫొటో ఒకటి ఇప్పుడు నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.

తారక్ నటించిన దేవర ట్రైలర్‌ను సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్న విషయం తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా, తారక్ చర్చించుకుంటున్న స్టిల్ చూసిన మూవీ లవర్స్.. ఏంటీ ఈ ఇద్దరు సినిమాకు ఏమైనా ప్లాన్ చేస్తున్నారా..? అంటూ మాట్లాడుకుంటున్నారు. అయితే ఈ క్రేజీ సెలబ్రిటీల కలుసుకోవడం వెనుక సీక్రెట్ ఏమీ లేదని.. ఇద్దరిదీ కేవలం సరదా డిస్కషన్ మాత్రమేనని ఇన్‌సైడ్ టాక్. ఇదిలా ఉంటే అభిమానులు మాత్రం అర్జున రెడ్డి దర్శకుడు తారక్ కోసం సెన్సేషనల్ స్టోరీ రాయాలని భావిస్తుండగా.. మరి రానున్న రోజుల్లో ఈ ఇద్దరి కాంబోలో సినిమా ఏమైనా వస్తుందేమో చూడాలి.

కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న దేవర రెండు పార్టులుగా రాబోతుండగా.. పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సైఫ్ అలీఖాన్, ప్రకాశ్ రాజ్, షైన్ టామ్ చాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# క హక్కులు తీసుకున్న దుల్కర్



యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'క'. పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమా మలయాళ థియేట్రికల్ హక్కులను అగ్ర హీరో దుల్కర్ సల్మాన్ సొంతం చేసుకున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చూసిన దుల్కర్ సల్మాన్ ఎంతగానో ఇంప్రెస్ అయ్యారని, తమ సంస్థ వేఫరర్ ఫిలింస్ ద్వారా రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారని మేకర్స్ తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ కథాంశమిదని, ఆద్యంతం ఊహించని మలుపులతో సాగుతుందని దర్శకులు తెలిపారు. నయన్‌సారిక, తన్వీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విశ్వాస్ డానియేల్, సంగీతం: సామ్ సీఎస్, దర్శకత్వం: సుజీత్, సందీప్.